# ఆయిల్‌పామ్ ఆగమాగం!

## సాగును ప్రోత్సహించిన కేసీఆర్ ప్రభుత్వం

**స్వచ్ఛందంగా ముందు కొచ్చిన రైతులు**

- నిర్మల్ జిల్లాలో 7 వేల ఎకరాల్లో సాగు
- కాంగ్రెస్ సర్కారు నిర్వాకంతో సాగు ప్రశ్నార్థకం
- రైతులకు అందని ఇన్సెంటివ్‌లు
- కరెంటు కోతలతో ఎండుతున్న మొక్కలు
- శంకుస్థాపనకే పరిమితమైన ఆయిల్‌పామ్ పరిశ్రమ

దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లిలో ఏపుగా పెరిగిన ఆయిల్‌పామ్ తోట

నిర్మల్, మే 27 (నమస్తే తెలంగాణ): రైతులను లాభాలబాట పట్టించేందుకు కేసీఆర్ సర్కారు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకంతో సంక్షోభంలో పడిపోయింది. ఒకసారి ఆయిల్‌పామ్ మొక్క నాటితే నాలుగో యేట నుంచి దాదాపు 20 ఏండ్ల వరకు దిగుబడి వస్తుందని విస్తృతంగా ప్రచారం చేయగా, రైతులు స్వచ్ఛందంగా సాగుకు ముందుకొచ్చారు. ప్రతి 15 రోజుల నుంచి 20 రోజులకోసారి రైతుకు డబ్బులు వచ్చే పంట, పర్యావరణానికి మేలు చేసే పంట కావడంతో కేసీఆర్ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించింది. ఈ పంట సాగుకు నీటి వినియోగం, విద్యుత్ వినియోగం కూడా చాలా తక్కువ. ఎకరం వరి పంటకు అవసరమయ్యే నీటితో నాలుగు నుంచి ఐదు ఎకరాల వరకు ఆయిల్‌పామ్ తోటలను పెంచుకునే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను పెంచాలనే బృహత్ సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం 2021 సంవత్సరంలో 32 జిల్లాలను 13 ఆయిల్‌పామ్ కంపెనీలకు కేటాయించి అవసరమైన ప్రోత్సాహకాలను అందజేసింది. ఆయా కంపెనీలు ప్రతి జిల్లాలో నర్సరీలను ఏర్పాటు చేసి మొదటి ఏడాదిలోనే 50 లక్షలకు పైగా మొక్కలను పెంచి రైతులకు ఊరూరా అందజేశాయి. ఆయిల్‌పామ్ దిగుబడులను స్థానికంగానే కొనుగోలు చేసేందుకు దాదాపు అన్ని జిల్లాల్లో పరిశ్రమలను కూడా ఏర్పాటు చేయతలపెట్టింది. ఇందులో భాగంగానే నిర్మల్ జిల్లాలోని సోన్ మండలం పాక్‌పట్ల గ్రామ శివారులో దాదాపు 40 ఎకరాల స్థలాన్ని సేకరించి రూ.300 కోట్లతో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు మాజీ మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. కాంగ్రెస్ సర్కారు హయాంలో ఆరు నెలలుగా పరిశ్రమ నిర్మాణానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో తమ పంట ఉత్పత్తులను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

అదిలాబాద్‌లో జేసీబీతో ఆయిల్‌పామ్ చెట్లను తొలగిస్తున్న దృశ్యం

### నిర్మల్ జిల్లాలో 7 వేల ఎకరాల్లో సాగు

నిర్మల్ జిల్లాలో రెండేండ్లలో 7 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేశారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు 2021 నుంచి దాదాపు మూడేండ్ల పాటు కేసీఆర్ ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.4200 చొప్పున ఇన్సెంటివ్‌ను కూడా అందించింది. ఆయిల్‌పామ్ సాగుకు అవసరమైన డ్రిప్ సిస్టమ్‌తో పాటు నిరంతర కరెంటు, ఇతర సాంకేతిక సదుపాయాలను కల్పించింది. సారంగాపూర్ మండలం బీరవెల్లి నర్సరీ ద్వారా జిల్లాలోని వివిధ గ్రామాల రైతులకు సబ్సిడీపై మొక్కలను అందించారు. అంతా సాఫీగా జరుగుతున్న సమయంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. అధికారంలోకి వచ్చి ఆరునెలలు అయినా ఆయిల్‌పామ్ సాగుపై సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇప్పటివరకు ఒక్క సమీక్ష కూడా చేయలేదు. రైతులకు వ్యవసాయశాఖ నుంచి ఎలాంటి సహకారం, ప్రోత్సాహకాలు మంజూరు కావడం లేదు. శంకుస్థాపనకే పరిమితమైన పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో అడుగు కూడా ముందుకు పడలేదు. పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వచ్చిన ప్రీ-యూనిక్ కంపెనీపై ప్రస్తుత ప్రభుత్వానికి ఎలాంటి అజమాయిషీ లేకపోవడంతో కంపెనీ ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు కరెంటు కోతల కారణంగా ఆయిల్‌పామ్ మొక్కలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయిల్ పామ్ రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

### ఆయిల్‌పామ్ రైతులను ఆదుకోవాలి

పదేండ్లుగా ఒక వ్యవస్థకు అలవాటు పడ్డ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఎదురైంది. కేసీఆర్ ఎంతో ముందుచూపుతో పామాయిల్ సాగును చేపట్టేలా రైతులను ప్రోత్సహించారు. 2021-22 సంవత్సరంలో 80 వేల ఎకరాలు, 2022-23లో 65 వేల ఎకరాలు, 2023-24లో 55 వేల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయిల్‌పామ్ సాగుపై సమీక్షించలేదు. ఎకరానికి రూ. 4200 ఇన్సెంటివ్ ఇవ్వడంలేదు. కరెంటు సక్రమంగా రాకపోవడం, బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ఆయిల్‌పామ్ సాగుపై సీఎం హైలెవల్ మీటింగ్ ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి అధికారులకు అవసరమైన ఆదేశాలివ్వాలి. 24 గంటలపాటు నిరంతరాయంగా కరెంటు ఇవ్వాలి. ఇన్సెంటివ్‌లు, 90 శాతం సబ్సిడీతో ఫాం పాండ్స్, డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్‌ను అందించి, పంటను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

*-లోక వెంకటేశ్వర్‌రాంరెడ్డి, ఉద్యానవన శాఖ రాష్ట్ర మాజీ కమిషనర్*

# కీరవాణిని తలదన్నేటోడు తెలంగాణల ఉన్నడా?

మొదటిపేజీ తరువాయి...

ఆయనను. మన దగ్గర చేస్తం. క్యాసెట్లు చేసేవాళ్లు వందలు వేలు ఉన్నరు.

**ప్రేమ్‌రాజ్:** క్యాసెట్లు కాదన్నా.. సినిమాలకు చేశారన్నా. నా సినిమా చేసిన రవికళ్యాణ్ ఉన్నడు, అర్జున్ ఉన్నడు.

**అందెశ్రీ:** అట్లా కాదు తండ్రీ.. నీ సినిమాకు పెట్టుకున్నవాళ్లను నా సినిమాకు పెట్టుకోలేను కదా.

**ప్రేమ్‌రాజ్:** అది నీ సినిమా కాదన్నా. నీ సినిమా అయితే పట్టించుకునేవాన్ని కాదన్నా. నువ్వు సినిమా తీసి కీరవాణిని పెట్టుకో, రెహమాన్‌ను పెట్టుకో ఎవరినైనా పెట్టుకో. అది తెలంగాణ ఆత్మగౌరవం కదన్నా. మాకు సంబంధం లేదా?

**అందెశ్రీ:** నేను అడిగినదానికి జవాబు ఇవ్వలేదు నువ్వు. సోనియాగాంధీ ఒక భారత దేశ మహిళ కాదు. ఆమె తెలంగాణ రాష్ట్రం ఇచ్చి బతుకునే పోగొట్టుకున్నది. అయినా మనం దానికి సంబురాలు పడుతున్నం.

**ప్రేమ్‌రాజ్:** ఆ పాట మా ఆత్మగౌరవం. ఎవడో వచ్చి ఎవడో ఏదో చేస్తే మేం చూడలేం.

**అందెశ్రీ:** నువ్వు తినే పిడికెడు మెతుకులు ఉంటయి కదా.. అవి ఏ ప్రాంతంలో పండించినరో ఎవ్వడూ చెప్పడు, ఎన్ని చేతుల కష్టమో అని ఎవ్వడు చెప్పడు.

**ప్రేమ్‌రాజ్:** దానికి దీనికి ఎందుకు సంబంధం అన్నా.. అట్లాంటప్పుడు తెలంగాణ ఎందుకు తెచ్చుకోవాలె?

**అందెశ్రీ:** కచ్చితంగా సంబంధం ఉంటది

**ప్రేమ్‌రాజ్:** అట్లాంటప్పుడు తెలంగాణ ఎందుకు తెచ్చుకోవాలన్నా.. ఎందుకు తెలంగాణ గురించి నువ్వు మాట్లాడినవ్?

**అందెశ్రీ:** అట్ల అనుకుందాం. మరి సోనియా ఇచ్చిన తెలంగాణ, ఆమెది ఇటలీ.. మాకు ఎందుకు అని వదిలేస్తరా?

**ప్రేమ్‌రాజ్:** ఢిల్లీలో ఎవరున్నా చేయాలె అది. ఆత్మగౌరవం వేరు, టెక్నికాలిటీ వేరు.

**అందెశ్రీ:** ఇది కూడా అంతే. టెక్నికల్‌గా రాసుకున్న కవికి ఒక ఆలోచన ఉంటది

**ప్రేమ్‌రాజ్:** ఆస్కార్ గ్రహీత కావాలా?

**అందెశ్రీ:** ఆస్కారం నాకెందుకయ్యా?

**ప్రేమ్‌రాజ్:** నీకెందుకన్నా ఆస్కార్ గ్రహీతలు ఇప్పుడు?

**అందెశ్రీ:** తెలంగాణ ప్రజల ఔన్నత్యానికి బానిసను

**ప్రేమ్‌రాజ్:** మీరు కీర్తికి బానిసా?

**అందెశ్రీ:** కీర్తి... వద్దులే నీకెందుకు?

**ప్రేమ్‌రాజ్:** ఇట్ల చేస్తే మాకు కోపమొస్తది.

**అందెశ్రీ:** ఒకవేళ నీకు చేతనైతే నా కీర్తిని తగ్గించేందుకు ప్రయత్నం చెయ్యి.

**ప్రేమ్‌రాజ్:** ఎవరి కీర్తిని ఎవరు తగ్గియ్యరన్నా.

**అందెశ్రీ:** నువ్వు ఏం మాట్లాడకు ఇక. నీకు చాతనైతే ఆ కీర్తి తలనరికేతందుకు ప్రయత్నం చెయ్యి

**ప్రేమ్‌రాజ్:** మీ కీర్తిమీద ఎవరికి అసూయ లేదు.

**అందెశ్రీ:** మరి నీకెందుకువయా.. కీర్తి కావాలని మాట్లాడుతున్నవ్. కీర్తి కండూతి నీకుంటది.

**ప్రేమ్‌రాజ్:** మీకు ఇది అవసరమా?

**అందెశ్రీ:** కచ్చితంగా అవసరం.. నాకు కాదు.

**ప్రేమ్‌రాజ్:** ఆ పాట విషయంలో తెలంగాణకు ఏది అవసరమో, అదే అవసరం. మీ వ్యక్తిగతం ఏముండదు దాంట్లో

**అందెశ్రీ:** నాకు వ్యక్తిగతం అంటలేను, ఇప్పుడు కూడా వ్యక్తిగతం కాదు.

**ప్రేమ్‌రాజ్:** అది మీది కాదు పాట..మీరెట్ల నిర్ణయం తీసుకుంటరు?

**అందెశ్రీ:** ఇప్పుడు నిన్ను అడగాలా? ఇప్పుడు అడగాలా వచ్చి.

**ప్రేమ్‌రాజ్:** అప్పుడు మాట్లాడకపోతే ఇప్పుడు రైట్ లేదా?

**అందెశ్రీ:** అట్ల కాదే.. నీకు రైట్ ఉంటే ఏం చేస్తవో చెయ్యే. నీకు ఏదన్నా చేతనైతే నా కీర్తి తల నరికేతందుకు కంకణం కట్టుకుంటే ఆ పనిచెయ్యి.

**ప్రేమ్‌రాజ్:** నీ కీర్తి జోలికి ఎవడొస్తరన్నా.. మాకేం అవసరం? ఈ అదనపు కీర్తి ఎందు కంటున్న. నీకు ఉండేది తక్కువున్నదా? అడిషనల్‌గా కీరవాణి కీర్తి కావాలా?

**అందెశ్రీ:** ఆ కీర్తి ఎవరికి కావాల్నో వారికి తెలిసి ఉంటది గని.. నీతో మాట్లాడే సమయం కూడా లేదు.

**ప్రేమ్‌రాజ్:** తెలంగాణలో ఉన్న ఒక గల్లీలో ఉన్న మ్యూజిక్ డైరెక్టర్ అంతకన్నా బాగనే చేస్తడు.

**అందెశ్రీ:** ఓ తండ్రి.. నేను ఇంతసేపు మాట్లాడిన అంటే నేను దేని కోసం మాట్లాడిన.. ఎందుకోసం మాట్లాడిన

**ప్రేమ్‌రాజ్:** మాట్లాడే అవసరం లేదనంటే మేమేం చేయలేంగానీ..

**అందెశ్రీ:** నా కీర్తిని అడ్డగించేతందుకు, నా కీర్తి తల నరికేతందుకు ఏమైనా ప్రయత్నం ఉంటే చేసుకో

**ప్రేమ్‌రాజ్:** ఏం కీర్తి అన్నా.. నీ కీర్తి జోలికి ఎవడు వస్తడు, ఏం అవసరం, మాకేమన్నా వస్తదా?

**అందెశ్రీ:** ఇప్పుడు మాట్లాడేందుకు నాకు సమయం లేదు.

# రాష్ట్ర అవతరణ ఉత్సవాలు ఒక్క రోజే

- **జూన్ 2న రాష్ట్ర గీతం ఆవిష్కరణ**
- **ట్యాంక్‌బండ్‌పై కళా ప్రదర్శనలు**
- **సీఎస్ శాంతికుమారి సమీక్ష**

హైదరాబాద్, మే 27(నమస్తే తెలంగాణ): జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. జూన్ 2న ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అసువులుబాసిన అమరులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పిస్తారని, అనంతరం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం ఆమె సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. పరేడ్‌గ్రౌండ్‌లో ఉదయం ఏర్పాటు చేసే కార్యక్రమంలో సీఎం రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించడంతోపాటు సందేశం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై రాష్ట్రంలోని అన్నీ కళారూపాలతో పెద్ద ఎత్తున కార్నివాల్ నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనితోపాటు శిక్షణ పొందుతున్న ఐదువేల మంది పోలీస్ అధికారులు బ్యాండ్‌తో ఈ ప్రదర్శనలో పాల్గొంటారని వివరించారు. ట్యాంక్‌బండ్‌పై దాదాపు 80 స్టాళ్లను ఏర్పాటుచేస్తామని చెప్పారు. హస్తకళలు, చేనేత, స్వయం సహాయక బృందాలు తయారుచేసిన పలు వస్తువులతోపాటు హైదరాబాద్‌లోని పేరొందిన హోటళ్ల ఆధ్వర్యంలో ఫుడ్‌స్టాళ్లను కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే పిల్లలకు పలు క్రీడలతో కూడిన వినోదశాలను ఏర్పాటుచేయనున్నట్టు పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం ఆకర్షణీయమైన పటాకుల ప్రదర్శనతోపాటు లేజర్‌షో ఏర్పాటుచేయనున్నట్టు వివరించారు. ట్యాంక్‌బండ్‌పై పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లుచేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. రాష్ట్ర అవతరణ సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్తు దీపాలతో అలంకరించాలని సూచించారు. సమావేశంలో డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దానకిశోర్, శైలజా రామయ్యర్, శ్రీనివాసరాజు, జీఏడీ కార్యదర్శి రఘునందన్‌రావు, అడిషనల్ డీజీలు సంజయ్‌కుమార్‌జైన్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు, ఎన్‌పీడీసీఎల్ ఎండీ ముష్రాఫ్, హెచ్‌ఎండీఏ అడిషనల్ కమిషనర్ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్, డీజీపీ

### అందరూ భాగస్వాములు కావాలి

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యేలు, మేయర్లు, జెడ్పీ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్ పర్సన్లు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు తమ కార్యాలయాల్లో జూన్ 2న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని సూచించారు.

# పట్టభద్రుల మద్దతు బీఆర్‌ఎస్‌కే: జగదీశ్‌రెడ్డి

నీలగిరి, మే 27: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ డబ్బుల పంపకానికి తెరలేపిందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో సోమవారం పోలింగ్ విధానాన్ని ఆయన పరిశీలించారు. నల్లగొండలోని ఎన్జీ కళాశాల వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉప ఎన్నికలు ప్రశాంతంగా సాగాయని, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ఓటర్లు బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలిచారని, దీన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ దాడులు, దౌర్జన్యాలకు దిగిందని ఆరోపించారు. నార్కట్‌పల్లిలో స్వతంత్ర్య అభ్యర్థి అశోక్‌పై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. అతి తక్కువ కాలంలో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సేనని అన్నారు. ప్రారంభం నుంచి కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా కనిపించిందని అన్నారు. అక్కడక్కడా సీఐలు, ఎస్సైలు కాంగ్రెస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బీజేపీ పోటీలోనే లేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



వరంగల్ నగరంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు

# ఎమ్మెల్సీ పోలింగ్ 68%

మొదటిపేజీ తరువాయి...

ఓటర్లు సైతం పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరారు. కాంగ్రెస్ పార్టీ ఓటమి భయంతో ఓటర్లను ప్రలోభపెట్టడానికి తీవ్రంగా ప్రయత్నించింది. ఆ పార్టీ నాయకులు అనేక చోట్ల ఒక్కో ఓటుకు రూ.500 నుంచి రూ.1000 వరకు బహిరంగంగానే పంపిణీ చేశారు. అయినా, కాంగ్రెస్ నాయకులపై పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నకిరేకల్, పాలేరు సహా అనేక నియోజకవర్గాల్లో ఇలా డబ్బులు పంపిణీ చేసే వీడియోలు బయటికి వచ్చినా వారిపై ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సమయం ముగిసినా.. కొందరు క్యూలైన్లలో ఉండటంతో వారందరికీ ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. దీంతో ఓటింగ్ శాతం కొద్దిగా మారే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో జూన్ ఐదోతేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఓట్లన్నింటినీ కలిపి బండళ్లుగా కట్టిన అనంతరం ఓట్ల లెక్కింపు మొదలుపెడతారు. గెలిచే అభ్యర్థికి చెల్లిన ఓట్లలో 50 శాతం+1 రావాల్సి ఉంటుంది. మొదటి ప్రాధాన్యంలో కావాల్సిన ఓట్లు రాకుంటే రెండో ప్రాధాన్యం ఓట్లను, ఎలిమినేషన్ విధానాన్ని తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి ప్రారంభిస్తారు.

**గ్రాడ్యుయేట్ ఉప ఎన్నిక పోలింగ్ వివరాలు**

| జిల్లా | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| నల్లగొండ | 80,871 | 53,981 | 66.75 |
| సూర్యాపేట | 51,497 | 36,367 | 70.62 |
| భువనగిరి | 34,080 | 22,988 | 67.45 |
| ఖమ్మం | 83,879 | 54,973 | 65.54 |
| కొత్తగూడెం | 40,106 | 27,294 | 68.05 |
| భూపాలపల్లి | 12,535 | 8,669 | 69.16 |
| ములుగు | 10,299 | 7,677 | 74.54 |
| మహబూబాబాద్ | 34,933 | 24,285 | 69.52 |
| వరంగల్ | 43,812 | 31,036 | 70.84 |
| హనుమకొండ | 43,729 | 31,141 | 71.21 |
| జనగామ | 23,419 | 16,767 | 71.60 |
| సిద్దిపేట | 4,679 | 3,267 | 69.82 |
| మొత్తం | 4,63,839 | 3,18,445 | 68.65 |

# పోలింగ్ కేంద్రం వద్ద తీన్మార్

- **పది మంది అనుచరులతో పోలింగ్ కేంద్రంలోకి..**
- **కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న వెళ్లడంపై అభ్యంతరం**

కాజీపేట, మే 27 : వరంగల్ నగరంలోని కాజీపేట పట్టణం 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని పోలింగ్ కేంద్రంలోకి కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పది మంది అనుచరులతో వెళ్లారు. దీనిపై అక్కడే ఉన్న పట్టభద్రుల ఓటర్లు, స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకే ఓటర్లు వెళ్లారని పోలీసులు చెప్పడంతో పోలీసులతోనూ వాగ్వాదానికి దిగారు. పాఠశాల ఆవరణలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించాలని నిరసన తెలిపారు. మల్లన్నకు ఉన్న అదనపు అర్హతలు ఏమిటని వారు నిలదీయడంతో పోలీసులు సమాధానం చెప్పలేక నీళ్లు మింగారు. అనంతరం అనుచరులను బయటికి పంపి అభ్యర్థి మల్లన్ననే అనుమతించడంతో వాగ్వాదం సద్దుమణిగింది.

## ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిపై కాంగ్రెస్ నాయకుల దాడి

- **నార్కట్‌పల్లిలో డబ్బులు పంపిణీ చేస్తున్నారని నిలదీత**
- **మీడియా సిబ్బంది కెమెరా, ఫోన్లు ధ్వంసం**
- **స్టేషన్ ఎదుట అశోక్ ఆందోళన**

నార్కట్‌పల్లి, మే 27: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి అశోక్‌పై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు. నల్లగొండ నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి అశోక్ నార్కట్‌పల్లిలో పోలింగ్ తీరును పరిశీలించేందుకు వచ్చారు. అప్పుడే నార్కట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు డబ్బులు పంచుతున్నట్టు ఆయనకు సమాచారం అందింది. వెంటనే ఆయన మీడియాతో కలిసి అక్కడికి వెళ్లి వారిని ప్రశ్నించారు. అక్కడ కాంగ్రెస్ నాయకులు అశోక్‌తోపాటు మీడియా సిబ్బందిపై దాడి చేసి వీడియో రికార్డు చేస్తున్న కెమెరా, ఫోన్లు ధ్వంసం చేశారు. ఈ విషయంపై నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో అశోక్ ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించకపోవడంతో స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ అశోక్‌తో మాట్లాడి దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తనకు ప్రాణహాని ఉందని చెప్పడంతో అశోక్‌కు అధికారులు గన్‌మన్‌ను కేటాయించారు.

# బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు తావులేదు

ఓటమి నైరాశ్యంలో తీన్మార్ మల్లన్న • బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

ఖానాపురం, మే 27: ఎన్నికల్లో ఒక స్థిరమైన వ్యక్తిత్వం గెలుస్తుందే తప్ప బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు తావులేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించిన అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి నైరాశ్యంతో తీన్మార్ మల్లన్న చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. ప్రజాసేవ కోసం అమెరికాలో ఉన్నత ఉద్యోగం మానేసి ఇండియాకు వచ్చింది జై తెలంగాణ నినాదం కోసమేనని అన్నారు. ఆనాడు తనను కాకతీయ యూనివర్సిటీ ముందుండి నడిపించిందని, ఉస్మానియా యూనివర్సిటీ నాయకులతో రాజకీయ పాఠాలు నేర్చుకున్నానని చెప్పారు. ఇప్పటికైనా తీన్మార్ మల్లన్న తన మాటలు మార్చుకోకపోతే భూస్థాపితం కాక తప్పదని హెచ్చరించారు.

ఓటు వేసినట్టు చూపుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

# ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డి విజయం ఖాయం

జనగామలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

• ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ చౌరస్తా, మే 27: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఘనవిజయం సాధిస్తారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ స్కూల్ పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓటు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిరుద్యోగులు, పట్టభద్రులు విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. ఆరునెలల కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారెంటీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగ నోటిఫికేషన్లు, మెగా డీఎస్సీ హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. క్లీన్ ఇమేజ్ ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని పట్టభద్రులంతా కలిసి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించబోతున్నారని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇప్పటికే నాలుగుసార్లు ఘన విజయం సాధించిన బీఆర్‌ఎస్ పట్టభద్రులు, నిరుద్యోగులు, మేధావుల మద్దతుతో ఐదోసారి గెలుపొందడం ఖాయమైందని పేర్కొన్నారు.

# కారు ఢీకొని దంపతుల దుర్మరణం

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడానికి వస్తుండగా ఘటన

మృతులు పాయం కృష్ణ, జానకి (ఫైల్)

టేకులపల్లి/బూర్గంపహాడ్, మే 27 : కారు ఢీకొనడంతో దంపతులు దుర్మరణం చెందారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తన భార్యతో ఓటు వేయించడానికి బైక్‌పై వెళ్తుండగా వీరి బైక్‌ను కారు ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. వివరాలు ఇలా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం సంపత్‌నగర్‌కు చెందిన పాయం కృష్ణ (40), జానకి(36) దంపతులు. ఉద్యోగ రీత్యా పాల్వంచ వెళ్లిపోయారు. జానకి స్వగ్రామం టేకులపల్లి కావడంతో అక్కడ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయించడానికి సోమవారం పాల్వంచ నుంచి బైక్‌పై తీసుకొస్తున్నాడు. లక్ష్మీదేవిపల్లి మండలం లాల్‌తండా సమీపంలోకి రాగానే జనగామ నుంచి భద్రాచలం వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలైన దంపతులను స్థానికులు కొత్తగూడెంలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలోనే వారు మృతిచెందారు. వీరికి ఒక పాప ఉన్నది.

### ఓటేసి వెళ్తుండగా యువకుడి దుర్మరణం

కుంజా రాజశేఖర్(ఫైల్)

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి దుర్మరణం చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం మోరంపల్లిబంజర్‌లో సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నది. అశ్వాపురం మండలం పాములపల్లికి చెందిన కుంజా రాజశేఖర్(32) పాల్వంచ లోని ఓ ప్రైవేటుస్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్నాడు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు బైక్‌పై పాములపల్లికి వచ్చి అశ్వారావుపేటలో ఓటు హక్కు వినియోగించుకున్నాడు. తిరిగి పాల్వంచకు వెళ్తుండగా మోరంపల్లిబంజర్ సమీపంలోకి రాగానే హైవేపై ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై నుంచి కింద పడిన రాజశేఖర్ తలపై అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న లారీ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

## నేడు సోనియాతో రేవంత్, భట్టి భేటీ

### జూన్ 2న అవతరణ ఉత్సవాలకు ఆహ్వానం

హైదరాబాద్, మే 27(నమస్తే తెలంగాణ): జూన్ 2న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ ఉత్సవాలకు రావాల్సిందిగా కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిసి స్వయంగా ఆహ్వానించనున్నారు. మంగళవారం ఢిల్లీ వెళ్లనున్న ఈ ఇద్దరు నేతలు సోనియాగాంధీతో భేటీ కానున్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి కేరళలో ఉండగా, డిప్యూటీ సీఎం పంజాబ్‌లో ఉన్నారు. మంగళవారం ఉదయం వీరిద్దరూ ఢిల్లీకి చేరుకోనున్నారు. ఇప్పటికే రాష్ట్ర అవతరణ వేడుకలకు సోనియాగాంధీని ఆహ్వానించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. అవతరణ వేడుకలకు హాజరయ్యేందుకు సోనియాగాంధీ సుముఖత వ్యక్తం చేస్తారా? లేదా? అనేదానిపై చర్చ జరుగుతున్నది. మరోవైపు సోనియాను ఎలా ఆహ్వానిస్తారని పలువురు ప్రశ్నిస్తున్న విషయం తెలిసిందే.

## 3 రోజులు ఘనంగా దశాబ్ది వేడుకలు

మొదటిపేజీ తరువాయి...

నిర్ణయించింది. ఇందులోభాగంగా మూడురోజుల కార్యక్రమాలను పార్టీ ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న తెలంగాణభవన్‌లో నిర్వహించే ముఖ్య కార్యక్రమానికి కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ వేడుకల్లో తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన అమరులను స్మరించుకోనున్నారు. వారి త్యాగాలను గుర్తు చేసుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి, స్వరాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజల సహకారంతో దశాబ్దకాలంపాటు ప్రగతిని సాధించి దేశానికే ఆదర్శంగా తెలంగాణను నిలిపిన ఘనత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని కేసీఆర్ పునరుద్ఘాటించారు. ఈ చారిత్రక సందర్భంలో దశాబ్ది ముగింపు వేడులను ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా కార్యకర్తలు, పార్టీ అందించే సూచనలను అనుసరించి ముగింపు వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాలు**

**జూన్ 1 (శనివారం):** గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుంచి ట్యాంక్‌బండ్‌పై ఉన్న అమరజ్యోతి వరకు రాత్రి 7 గంటలకు క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలు చేసిన అమరులకు పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులు అర్పిస్తారు.

**జూన్ 2 (ఆదివారం):** తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్ది కాలం గడుస్తున్న నేపథ్యంలో జూన్ 2న దశాబ్ది ముగింపు వేడుకల సభను హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన నిర్వహిస్తారు. అదేరోజు హైదరాబాద్‌లో పలు దవాఖానాలు, అనాథ శరణాలయాల్లో పార్టీ ఆధ్వర్యంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేస్తారు.

**జూన్ 3 (సోమవారం):** రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాల్లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను, జాతీయ జెండాను ఎగరవేస్తారు. ఆయా జిల్లాల్లోని దవాఖానలు, అనాథ శరణాలయాల్లో స్వీట్లు, పండ్లు పంపిణీ చేస్తారు.